
# అధికారం

-శ్రీసుభా

వారం వారం కథాప్రభ

**విజయవాడ నుంచి శంకరం ఉత్తరం రాశాడు. వాడు నా ప్రాణస్నేహితుల్లో ఒకడు. పైగా మేం కలిసి చదువుకున్నాం. ఉద్యోగాల్లో స్థిరపడి, పెళ్లిళ్లు చేసుకుని వేర్వేరు ప్రదేశాల్లో ఉంటున్నా మాస్నేహాలు పల్చబడలేదు. మాతోపాటు ఆడవాళ్లు కూడా ఆస్నేహానికి నీరుపోసి, నారు వేశారనే చెప్పుకోవాలి.** అలాంటిది వాడీ మధ్య రాసే ఉత్తరాల్లో నాకు కొంచెంకొంచెంగా బాధ. ...ఆపైన ఆవేదన. నైరాశ్యపునీడలు కనబడుతూ వచ్చాయి. నేను నాకుతోచిన సలహాలు ఇస్తూ వచ్చాను. ...ఉత్తరాల్లో... అయితే రెండురోజులనాడు వాడు నాకో సుదీర్ఘమైన ఉత్తరం రాశాడు. అది



చదివిన తర్వాత నాకు మనసంతా దేవినట్టుగానే ఉంది. శంకరం రెండేళ్లుగా తన జీవితం ఎలా గాడితప్పిందో విపులంగా రాశాడు... తను అవస్థల పాలవడానికి భార్యాపిల్లలూ...కోడళ్లూ ఏ విధంగా కారకులయ్యిందీ రాశాడు. ఉత్తరంముగిస్తూ వాడు రాసిన మాటలు బాధకు పరాకాష్ఠ అన్పిం చాయి. "రాజా ...చదువుకునే రోజుల్లో, ఆ తర్వాతా కూడా మనం ఎన్నిసార్లు అనుకోలేదనీ...ఏది ఏమైనా అటుసూర్యుడు ఇటుపొడిచినా మనం ఎప్పుడూ సంతోషాన్ని చేజార్చు కోకూడదని!మనల్ని మనం తక్కువ చేసుకుని ఆపైన ఇంటినీ, వీధినీ ,సమాజాన్నీ వ్యథలపాలు చేయకూడదని! నేను సంవత్సరాలను నెలలుగా, నెలలను రోజులుగా దొర్లిస్తుంటే నావాళ్లే నాకు ఈ రోజునే యుగంగా మార్చిపారేశారు. నా మనశ్శాంతికి మంగళహారతులు కూడా పాడేశారు. ఇక భగవంతుడు ఉన్నాడు చూడు...ఆయనగారూ నా ఎదటి పక్షాన చేరి నన్ను కష్టాల కడలివైపు నెట్టుతున్నాడా అన్పిస్తోంది!

ఇవన్నీ ఎందుకు రాయాల్సివచ్చిందో నాకే తెలియదు. నిన్ను వెంటనే మా ఊరు రావల్సిందిగా కోరుతున్నాను. వస్తూవస్తూ దారిలో పూనాలో దిగి, మన రమణను కూడా వెంటతీసుకుని రా! వాడు మనిద్దరికీ కావల్సినవాడే! స్నేహితుడి హోదానుంచి నాకు వియ్యంకుడిగా మారాడు కదా! వాడూ వాడి పద్ధతీ ఏం చెబితే నీకు అర్థమౌతుంది. వాడి పెద్దకూతురు నా కోడలయిన తర్వాత మా ఇంటిలో వచ్చిన మార్పులు కళ్లతో చూడవలసిందే! అత్తగారికీ కోడలికీ క్షణం పడదు. రెండుజర్మనీలు ఒకటయ్యాయి. నార్త్ వియత్నాం, సౌత్ వియత్నాం ల సంగతి సరేసరి! ఇహనో రేపో ఉత్తరకొరియా, దక్షిణకొరియాలు స్నేహితుల జాబితాలోకి వెళ్లనూవచ్చు. ఇలా ప్రపంచంలో ఎన్ని కొత్తమార్పులు వచ్చినా మన దేశంలో 'అత్తాకోడళ్లు-ఐక్యత' అనే మాట ఈ యుగాంతం వరకు సాధ్య పడదేమో! సరే... నువ్వూ రమణా వస్తారని ఆశతో ఎదురుచూస్తాను. ఉంటాను.

-నీ శంకరం

వాడి ఉత్తరంలోని విషయాలు చాలాసేపు నా ఆలోచనల మీద తమ ప్రతాపాన్ని చూపాయి. శంకరం ఉన్నదానికి ఎక్కువ చేసుకుంటున్నాడో, లేని దానిని ఊహించి భయపడతున్నాడో నాకు ఓ పట్టాన తోచలేదు. నిజానికి మనమాటలకు, చేతలకు, మనకు దక్కే అదృష్టదురదృష్టాల కలనేతకు చాలా మటుకు మనమే కర్తలం అనుకుంటాం! గర్వంగా కాలరెత్తుకుని తిరిగేస్తాం. అయితే మనలోని లాలస...కాస్త అటూఇటూ అవగానే నీరు కారిపోతాం. బేజా రయి ఎనిమిది దిక్కులవెంటా పరుగులు తీస్తాం. ఆతర్వాత కొంచెం వివేకం తెచ్చుకుని, లెంపలు వాయించుకుని మనం నిమిత్తమాత్రులం ,అంతా పైవాడు సంభాళించవలసిందే నని చేతులు జోడిస్తాం. కాస్త మనశ్శాంతి... కాని తిరిగి అదే గాడిలో పడి కొట్టుకుపోతాం.

నేను విజయవాడ వెళ్లడానికి సన్నాహాలు ప్రారంభించాను. పూనా ఫోన్ చేసి రమణమూర్తికి చెప్పాను. శంకరానికి-'నేను వస్తున్నాను. కంగారుపడకు' అని ఉత్తరం రాసిపడేశాను. అప్పుడే లక్ష్మి నా గదిలోకి వచ్చింది. శంకరం రాసి న ఉత్తరం ఆమె చేతికిచ్చాను. ఆమె అంతా చదివి," మంచిది ఓసారి వెళ్లిరండి. మీకూ రిటైరయినప్పటి నుంచీ ఏంతోచడం లేదు. కాలక్షేపం అవుతుంది. గాలి మార్పు....." అంది నవ్వుతూ.

"లీవు గ్రాంటు చేశావన్నమాట!"

"అదిసరే. మన శేఖరం గురించి, మనతో సంబంధం గురించి ఆ రామారావు గారు ఉత్తరం రాశారుగా... శంకరంగారితో మాట్లాడి ఓసారి చూసిరండి. అన్నీ వాకబు చేయండి."

"మధ్యఇదోటా..." అన్నాను నేను.

"ఇదీ ఓ పనేగా..." అంది లక్ష్మి.

* * *


శంకరం నన్ను చూసి గుమ్మంలోనే

వాటేసుకున్నంత పని చేశాడు. ఇద్దరం ఒకర్ని ఒకరం చూసుకున్నాం. చాలాయేళ్లతర్వాత ఒకళ్లలో వచ్చిన మార్పు ఒక ళ్లం వింతగా చూసుకున్నాం. శరీరరాల మీద దొంగచాటుగా వయసుచేసిన విన్యాసాల గురించి ముచ్చటించుకున్నాం!

"ఇదేమిటి? ఇల్లు ఇంత నిశ్శబ్దంగా ఉంది. ఉమగారేరి? కోడళ్లు ఏరి? గడుగ్గాయి మనవలు కనబడరేం...."అంటూ గబగబా అడిగాను .

"ఉమ నిన్ననే మద్రాసు వెళ్లింది...వాళ్ల తమ్ముణ్ని చూడటానికి. మగపిల్లలు పెళ్లాలతో ఎల్.టి.సిలో ఉత్తర భారతయాత్రలో ఉన్నారు."

"నువ్వు ఒక్కడివీ ఇంట్లో తపస్సు చేసుకుంటున్నావ్...అంతేగా.... ఎంత రిటైరైనా ఈ




ఎకానమీ దేనికిరా...." అన్నాను నవ్వేస్తూ.

"అది సరే రాజూ! రమణగాడేడీ? రాలేదా?" అంటూ నెమ్మదిగా అడిగాడు శంకరం.

"వాడింట్లో ఏదో హడావిడి వచ్చిపడింది. రేపు రాత్రికి ఘనిద్దర్శీ సాగర్ రమ్మన్నాడు. " అన్నాను నేను.

శంకరం చిన్నగా నవ్వి " న్యాయానికి వియ్యంకుడి బెట్టు నేను చేయాలి.కానీ వాడు చేస్తున్నాడు. ... కానివ్వు... తప్పు నాది..." అని ఊరుకున్నాడు.

"చిన్నవిషయాల్ని పెద్దవిగా చేసుకోవడం... పెద్దవాళ్లకు మంచిది కాదురా. వాడు వ్యాపారం, ఆ గొడవల్లో తలమునకలవుతున్నాట్ట...."

ఇద్దరం సోఫాలో చతికిలబడ్డాం. నెమ్మదిగా కాఫీలు తాగాం. గతంలోకి వెళ్లాం. వర్తమానాన్ని సున్నితంగా పరిశీలించాం. కానీ భవిష్యత్ దగ్గరకు వచ్చేసరికి శంకరం గొంతుక ఆగిపోయింది.నేను వాడివైపోసారి చూసి "అసలు ఏమైంది రా...నీకు దిగులేమిటిట..అదీ ఈ వయసున....? అంటూ నిలదీసి అడిగాను. శంకరం తలవంచుకునే నేను వేసిన ప్రశ్నలు విన్నాడు. విమర్శలూ తట్టుకున్నాడు. సలహాలకూ చెవిఒగ్గాడు. కానీ అవన్నీ నిశ్శబ్దంలోనే నిశ్శబ్దంగానే చేశాడు. అంటే తలఊపడం మటుకు చేశాడు.

"నువ్వు మాట్లాడితే బావుంటుంది" అన్నాను.

"లేదురా ..నా పెంపకం లోపమో... నాదురదృష్టమో ..ఇంట్లో నేనంటే ఎవరికీ లెఖ్కలేదు. అది నెమ్మదిగా నా భార్యతో మొదలయి. కొడుకులూ కోడళ్ల వరకూ పాకింది.'

"ఉమగారి గురించా ...నువ్వు అబాండాలు వేస్తున్నావ్. ఆవిడ ఎటువంటిదో నాకు తెలియదా? " అన్నాను నవ్వుతూ.

"అన్నీ వాళ్లనుకున్నట్టే జరగాలంటారు. వాళ్లు చెప్పిందే వేదం. ఒక మాటలో చెప్పాలంటే...నాకు చలికాలంలో రగ్గులవసరమో, మామూలు దుప్పటీ సరిపో తుందో ఉమ చెప్తుంది. వేసవిలో డాబా మీద పడుకుంటే మంచుపడిజలుబు చేస్తుందో లేదో నాకన్నా వాళ్లకే బాగా తెలుసు."

వాడిమాటలు నాకు నవ్వు తెప్పించాయి.

"నీకుబుద్ధుందా? నేనుమానసికక్షోభ అనుభవిస్తున్నానంటే నవ్వుతావా?'' ఉడుకుమోత్తనంతో అన్నాడు శంకరం.

'' ఏమీ అనుకోకు...ఆపేక్షలు.. అనుబంధాలుఇవి కూడా స్వార్థం తాలూకు ఛాయలే! ఉదాసీనంగా ఉండటం అలవాటు చేసుకో! ఎందుకంటే మన మీదకు వయసుతో పాటు కొత్తతరం ఆలోచనలు కూడా దాడి చేస్తుంటాయి. యాభై దాటిన మగవాడు, ఆడదీ కూడా అడకత్తెరలో పోకలవ్వక తప్పదు...."


"నాబతుకు చిన్నప్పటి నుంచీ ఇంతే! అన్ని బాధ్యతలూ సక్రమంగా నిర్వ హించడం కూడా చేతకానితనంలోకే వస్తుందేమో!"

శంకరం చాలాసేపు మాట్లాడుతూనే ఉన్నాడు. నాకు చిన్నగా నవ్వు వచ్చింది. దాన్ని పెదాలమధ్యనే నొక్కిపట్టాను. నిజమే మనలో చాలామంది జీవితం అంటే ప్రాపంచిక సుఖదుఃఖాలను మాత్రమే లెఖ్కలోకి తీసుకుంటాం. దేని ప్రభావం మనమీద ఎక్కువగా ఉంటుందో ...ఆ విచారం...లేక ఆ ఆనందం చుట్టూ గూళ్లు నిర్మించుకుకని దాన్నే ఏకాంతనివాసంగా మార్చుకుంటాం. వ్యక్తులవల్ల కలిగే రాగవిరాగాలకు ప్రాధాన్యాన్నిస్తాం. అంతే గాని ..హృదయం ద్వారా, ఆత్మ ద్వారా లభించే పరమానందం వేరే ఉంటుందని...దాని కోసం కొంచెంగా. అతికొంచెంగానైనాప్రయత్నించాలని మర్చిపోతాం. అదే శంకరంతోచెప్పాను.


'నేను చెప్పేది ఒకటయితే నువ్వు చెప్పేది వేరొకటి. పైగా దుంపతెగ వేదాంతం విన్పిస్తున్నావు. వ్యవహారికులకు వేదాంతానికీ సయోధ్య కష్టం. ఇవి ఒకవరలో ఇమడని కత్తులు....

" భేషుగ్గా ఈ రెండింటికి స్నేహం నెరపొచ్చని ఎందరో ఒప్పుకుంటారు. 'స్పిరిచ్యువాలిటీ ఈజ్ ఎ సైన్స్ ఆఫ్ కాన్షన్‌నెస్.. '' అంటారు శ్రీఅరబిందో... అవగాహన కావాలోయ్....ఏదైనా' ' అన్నాను . నవ్వాను శంకరం వైపే చూసి నవ్వాను. శంకరం వైపు చూశాను. అయినా వాడి ధోరణిలో వాడు చెప్తున్నాడు. " ఏమోరా రాజూ అవన్నీ అలా

## చావుని దూరంగా ఉంచాలంటే ...




'ఓల్డ్ బ్లూ ఐస్' అనే నిక్‌నేమ్ గల హాలీవుడ్ స్టార్, గాయకుడు ఫ్రాంక్ సినాట్రా వయసు డిసెంబరు 12, 1996కి 81. యవ్వనంలో ఉండగా, మిత్రుడు నటుడు డన్‌మార్టిన్‌తో కలిసి ఫాస్ట్ లైఫ్‌ని గడిపిన ఇతగాడు



ఇప్పుడు తన జీవన పరిమాణాన్ని పెంచుకునేందుకు హైటెక్ ఆక్సిజన్ ఛాంబర్‌లో రోజుకి రెండుగంటలు గడుపుతున్నాడు. ప్యూర్ ఆక్సిజన్ పీల్చడం ద్వారా ఊపిరితిత్తుల కెపాసిటీ తగ్గినా, ఈ ఛాంబర్ ఆ నష్టాన్ని పూరిస్తోంది. దీని ఖరీదు 80,000 డాలర్లు.

- పృథ్వీరాజ్

ఉంచు. మన రమణగాడి సంగతి చూడు. నీకే తెలుస్తుంది. మామగారిగా తనకే సహాయం చెయ్యడం లేదని మా అబ్బాయి రామంగాడు నా మీద రుసరుసలు..... ఈవిషయంలో వాళ్ళిద్దరి మధ్యపోట్లాటలు... అటు రమణగాడు కూడా అంతే.... వియ్యంకుడు అయిన తర్వాత పాత స్నేహం పల్చబడిందనీ వాళ్లదగ్గర వీళ్లదగ్గరా అంటాడు. ...ఇదీ కథ అనుకో..ఏం చెప్పను....." అని శంకరం చేతి వాచి చూసి "పద భోజనానికి ఆలస్యం అయింది. హోటల్‌కి పోదాంలే... " అన్నాడు. నేను లేచాను. ఇద్దరం గుమ్మం దిగాం!!

* * *

నేనూ శంకరం నాగార్జునసాగర్‌లో రమణ మూర్తిని కలుసుకున్నాం. వాడు మమ్మల్ని వాటేసు కున్నంత పని చేశాడు. ప్రత్యేకంగా శంకరాన్ని... వాళ్లింట్లో వాళ్ల క్షేమసమాచారాలు పేరు పేరునాఅడిగాడు. తను భార్య లలిత గురించి పెళ్లి కావాల్సివున్న చిన్నకూతురు శైలజ గురించీ చెప్పాడు. నేను చాలారోజుల తర్వాత చూశానేమో వాడిలో మార్పు కొట్టవచ్చినట్టు కనిపించింది. వాడు బాగా ఒళ్లు చేశాడు. దాంతో గుమ్మటం మాదిరి కన్పిస్తున్నాడు. నేను నవ్వుతూ వాణ్ని చూసి అన్నాను..." జాగ్రత్త...నువ్వు బాగా లావెక్కినట్టు కన్పిస్తున్నావు. ఉదయం పూట వాకింగ్ చేస్తూండు. రాత్రిపూట అన్నం మానేసి జొన్నరొట్టెలు తిను. మద్యానికి మాంసాహారానికి మచ్చికలాంటిది ఉంటే వదిలిపెట్టు..."

రమణమూర్తి సరేరా అని నవ్వేసి-రిటైరయిన మీరు....చాలా చిక్కినట్టు దిగుళ్లు మోస్తున్నట్టు కన్పిస్తున్నారు. పెద్దమొత్తం చేతికందిందా.... దేనికట వ్యాకులత..." అన్నాడు.

"పెద్దమొత్తం కరగడం మొదలుపెట్టింది. పైగా ఆఫీసులో పెత్తనం చేస్తుంటే గుమాస్తాలు పడివుండే వారు. కానీ ఇంట్లో అవేం సాగడంలేదు. మనం ప దవీవిరమణ చేస్తే ఇంట్లోవాళ్లందరు నామీద సెక్ష న్ఆఫీసర్లుగా, సెక్రెటరీలుగా తయారయ్యారు" అన్నాడు శంకరం.

నేనూ, రమణా విరగబడి నవ్వాం.

"అవునురా.... రమణా.. మా భార్యల సంగతి అడుగు. వాళ్లు ఏకంగా ఇన్‌ఛార్జిమినిస్టర్లుగా మారి పోయారనుకో..." అన్నాను నేను నవ్వేస్తూ.

శంకరం నా వైపు చూసి "రమణ పనే నయం రా... సొంతవ్యాపారం... లాభనష్టాల పూచీ పూర్తిగా వాడిదే! లాభం వచ్చిందన్నా నమ్మాలి. ములిగాం అన్నా నమ్మాలి. అంతే కదురా రమణా... " అన్నాడు అదోలా..

రమణ శంకరం మాటలకు అవుననలేదు. కాదనలేదు. ముగ్గురం హోటల్‌కు వెళ్లాం. టిఫిన్లు తింటూ నేను కాలేజీరోజుల్ని గుర్తు చేశాను. అప్పటి ఆవేశాలు, ఆర్భాటాలు, స్నేహితులు, మాతో కలిసి చదివిన అమ్మాయిలు... అలా అలా చాలా విష యాలు మా కళ్లలో శోభాయమానంగా కదిలాయి. ఇంతలో వెనక నుంచి ఒకాయన శంకరాన్ని పేరు పెట్టిపిలిచాడు. శంకరం అటుకేసి చూసి, "మా పాత బాస్... ఈ గ్రహం గాడు ఇక్కడికీ తగలడ్డాడులా ఉంది" అంటూ బయటకు వెళ్లాడు.

"ఇంకాచెప్పరా ఎలా ఉన్నావ్..నీ ఆదర్శాలు, ఆశయాలు ఎలా ఉన్నాయ్" అంటూ రమణని అడిగాను నేను.

రమణ తన హృదయం విప్పి తన వ్యాపారం గురించి , తను సాకుతున్న తాతలనాటి అనాథ శరణాలయం, ఉచితపాఠశాల గురించీ...ఆ తర్వాత తన కుటుంబం గురించీ శంకరం ఇంట్లో ఇచ్చిన పెద్దకూతురు గురించీ చెప్పాడు.

ముఖ్యంగా శంకరంతో తను వియ్యం అందు కోవడం, ఆ తర్వాతి పరిణామాలు తమ మధ్య పెరిగిన దూరం అన్నీ చెప్పాడు. ఆఖరిగా హృద యంలో ఏనాటి బాధో ...బయటకు ఉబికినట్టు మాటలు ఆపి నిట్టూర్చాడు.

"నేను డబ్బుతో ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందేమోనని చూశాను. లాభంలేకపోయింది. వీళ్లందరి మధ్యా నాకూతురు నలిగిపోతోంది. ఒక సారి మనిషిరక్తం రుచి చూసిన పులి సాధువుగా మారడం అసంభవం. డబ్బు పిచ్చి ఉన్నవాళ్లు కూడా అంతేరా, రాజా...."

నేను ఆశ్చర్యంగా రమణ మొహం లోకి చూశాను.

"ఇప్పుడు మా శైలజ పెళ్లి నాకో సమస్యగా మారింది. నేను ఇప్పటికే మూడొంతులు కుదేల య్యాను. మా పాఠశాల, అనాథాశ్రమం నడపడం నావల్ల కాదని తేలిపోయింది. అక్కడవున్న పిల్లల కు రెండుపూటలా అన్నంపెట్టకుండా నేను నా ఇం ట్లో ఒక్క మెతుకుకతికినా అది అన్యాయమే అవు తుంది. వాటిని ప్రభుత్వపరం చేసేస్తున్నాను. "

"బాధపడకురా" అన్నాను నేను.

"లేదురా...అలా అనొద్దు...నువ్వు ...విషాదం ఉందిచూడు ... దీనికి మనిషిని ఎత్తుగా, విశాలంగా చేసే నైజం ఉంటుదంటారు... ఆ వరం ఆ అదృష్టం నాకు దక్కితే చాలనిపిస్తోంది. అప్పుడు బాధ,

దుఃఖం, విచారం ఇవి కూడా వరాలే అవుతాయి. ..."

"పద, అలా నాలుగడుగులు వేద్దాం..." అన్నాను నేను. ఇద్దరం కదిలాం.

"ఏమీ అనుకోనంటే నిన్నో మాట అడగాలని ఉంది రాజా.... అసలు నేనీ ఊరు వచ్చింది నీతో ఏకాంతంగా మాట్లాడ్డానికే..."' అని ఆగిపోయాడు రమణ.

"రమణా ..నా సంగతి నీకు తెలియదా? నేనే అడుగుతున్నాను చెప్పు.... నీ కేమన్నా సహాయం కావాలా... ఆర్థికంగా ఆదుకోమంటావా? పోనీ పూనా వచ్చేసి నీకు తోడుగా ఉండమంటావా?" అన్నాను.

రమణ నా ముఖం కేసి చూసి "నాది చాలాపెద్ద కోరికరా.... నువ్వు అది విని ఇటే పారిపోతావేమో...చెప్పడానికి భయంగా ఉంది."

"ఏంచేస్తానన్నది నాకు వదిలేయ్...ఏ అనుమానాలూ వద్దు... కానీయ్."

రమణ నెమ్మదిగా తన మనసులో మాట చెప్పాడు. చెబుతోన్నంత సేపూ వాడు కిందా మీదా అయ్యాడు. అప్పటికే బాగా ముసిరిన చీకటి .... మా మొహాలు ఒకరికొకరికి కనబడకుండా చేస్తోంది. వాడు చెప్పింది విన్న తర్వాత వెంటనే నానోట మాట రాలేదు. కానీ ఎందుకో వాడి భుజం మీద చెయ్యి వెయ్యాలనిపించింది. చెయ్యివేసి భుజం తట్టాను. ఇంతలో దూరం నుంచి శంకరం "అక్కడేం చేస్తున్నారు... రండి వెడదాం" అంటూ మాకు దగ్గరగా వస్తూ అన్నాడు. దాంతో నేను, రమణకు చెప్పాలనుకున్న మాటలు నాలిక చివరిదాకావచ్చినవి కాస్తా ...తిరిగి హృదయంలోకి వెళ్లిపోయాయి.

"ఇంతసేపూ ఏం చేస్తున్నారిక్కడ..... నడవండి..." అంటూ శంకరం మమ్మల్ని లాడ్జి వైపు నడిపించాడు.

* * *

నేను ఇంటిగుమ్మం ఎక్కకుండానే మా ఆవిడ లక్ష్మి నాకు ఎదురుగా వచ్చింది. ముందుగా మంచినీళ్లు, ఆ పైన కాఫీ ఇచ్చి పక్కన కూర్చుని అందరి యోగక్షేమాలూ అడిగింది. నేను అన్ని విషయాలూ చెప్పాను.

"అవునూ... అయితే రామారావుగారింటికి వెళ్లి వచ్చారా లేదా... వాళ్ల అమ్మాయి ఎలా ఉంది? " అంటూ లక్ష్మి గుర్తుచేసుకుంటూ అడుగుతోంది.

నాకు సడన్‌గా ఏం జవాబు చెప్పాలో తెలియలేదు.

"పెళ్లి సంబంధం మాటండీ.. వెళ్లేటప్పుడు మీకు చెప్పానుగా...."

"మర్చిపోయాను లక్ష్మీ ...."

"అయ్యో ..ఎంతపని చేశారండీ... మీకు స్నేహితులను చూస్తే ఒళ్లుతెలీదు. నేననుకున్నాను..." లక్ష్మి సణుగుతోంది.

"పోనీలేగాని ...దారిలో అంతకన్నా మంచి అమ్మాయిని, అందగత్తెని చూశాను. ఆ అమ్మాయిని నువ్వు చూశావంటే..." అన్నాను నేను లక్ష్మిని ఊరిస్తూ....

"వర్ణనలు సరే గానీ ఎవరమ్మాయిఇంతకీ ?"

"మన రమణమూర్తి కూతురు శైలజ... "

లక్ష్మి ఆశ్చర్యంగా అనుమానంగా నాఎచెప్పలేదే.."' అంది వెటకారంగా.

"మాటొచ్చింది కాబట్టి చెప్పాను. వాళ్లది మంచికుటుంబం. మనకి తెలుసున్నవాళ్లు. రమణ భార్య లలిత, వాళ్లూ ..." అని నేనేదో చెప్పబోతుంటే .... లక్ష్మి " ఛాల్లెండి' అంటూ నన్ను అడ్డుకుంది..

" అదేమిటి... అంత కోపం తెచ్చుకోవడం దేనికి లక్ష్మీ! అవును నాకిప్పుడు గుర్తొస్తోంది. ఉమ గారు ... అదే...శంకరం గారి భార్య ఆమధ్య ఉత్తరం రాసింది. ఆవిడ ఈ విషయం పసిగట్టిందేమో...మీ స్నేహితుడు రమణగారు పీకలోతు అప్పుల్లో ఉన్నారుట. రమణ.....ఆ లలిత గారు కూడా వీళ్లకు ముద్దుముచ్చట్లే తీరడం లేదుట. పైగా ఆ అమ్మాయి కూడా పెంకిదిట..." లక్ష్మి ఇంకా ఏదో చెప్పబోతోంది.

"అదికాదు...అసలు సంగతి నీకు తెలీదు...'

"తెలియనవసరం లేదండీ... మరీ ఉన్నవాళ్లు కాకపోయినా ఫరవాలేదు గానీ ..ఇదెక్కడి సంబంధం... ఆఖరికి మీ కుచేలుడి కూతురే దొరికిందా నాకొడుక్కి కట్టబెట్టడానికి! పైగా మన శేఖరం అమెరికా వెడతానంటున్నాడు. అదే కట్నం ఇచ్చి, వాణ్ని అమెరికా పంపేవాళ్లను చూడండి... తలమాసిన వాళ్ల సంగతి నా దగ్గర తేవద్దు...."

"శేఖరంగాడు అత్తవారిచ్చే డబ్బుతో మాత్రమే అమెరికా వెడతానని మొక్కుకున్నాడా? నాకర్థం కాదు... " నేను కోపంగా అన్నాను.

లక్ష్మి చర్రున సోఫాలోంచి లేచింది. "వాడు కాదండీ .. అలా అని నేను మొక్కుకున్నాను. సరేనా? ఇప్పుడే చెబుతున్నాను... వాడి పెళ్లి విషయంలో మీరు దయుంచి కలగజేసుకోవద్దు. మీకూ మీ స్నేహితులకూ మధ్య ఏమైనా మొహమాటాలుంటే వాటితో మాకు సంబంధం లేదు. నాకు తెలుసు...మీకు ఆ రమణమూర్తి గారికి ఏదో మాటిచ్చి ఉంటారు.. అవును...అవును..." అంటూ లక్ష్మి నన్ను పోరడం మొదలుపెట్టింది.

నేను నోరు తెరిచి ఏం చెప్పబోయినా ఏదీ వినదల్చుకోలేని దానిగా ప్రవర్తించింది. ఇంట్లో తనమాటే వేదంగా చెల్లాలన్నట్టు మాట్లాడింది. ....

ఆ క్షణాన నాకు నా తల నేలవాలినట్టుగా అన్పించింది. అప్పుడే నేను శంకరాన్ని ఓదారుస్తూ చెప్పిన రిటైరయిన వాళ్ల కబుర్లు, రాజుగారి కథా గుర్తుకు వచ్చింది.

నిజమే నాపేరు రాజు. కానీ నా శిరస్సున కిరీటం లేదనీ.... నాకు శాసనాధికారం లేదనీ, నాకు అప్పుడే తెలిసొచ్చింది.

P

